అవసరమైన చోట వదిలేశారు..

• ఫ్లై ఓవర్లు లేక ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

పూసపాటిరేగ: అవసరమైన చోట పైవంతెనలు (ఫ్లై ఓవర్) నిర్మించాలని జాతీయ రహదారి ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గ్రామాలకు ఆనుకుని ఉన్న జంక్షన్ల వద్ద సాధారణంగా ఫ్లై ఓవర్లు నిర్మిస్తారు. కాని ఇందుకుభిన్నమైన పరిస్థితులు మండలాల్లో నెలకొన్నాయి. పూసపాటిరేగ మండలంలోని పేరాపురం వద్ద పైవంతెన అవసరమైనప్పటికీ హైవే అధికారులు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయలేదు. అలాగే భోగాపురం మండలం సవరవల్లి జంక్షన్ చాలా గ్రామాలకు ప్రధాన కూడలి. గొలగాం, గంట్లాం, అక్కివరం, మోపాడతో పాటు ఇతర గ్రామాలకు నుంచి వాహనచోదకులు, ప్రజలు సవరవిల్లి జంక్షన్ మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ కూడా ఫ్లై ఓవర్ నిర్మించాల్సిన అవసరం ఉంది. అలాగే పూసపాటిరేగ మండలం పేరాపురం కూడా రద్దీ ఉండే జంక్షన్ కావడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి ప్రధాన కూడలిలో జాతీయ రహదారిపై ఫ్లెక్టైవర్ నిర్మించాల్సిన అవసరం ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ఇక్కడ మంజూరు చేయలేదు. ఈ పరిస్థితుల్లో జాతీయ


ఫ్లై ఓవర్ నిర్మించాల్సిన పేరాపురం జంక్షన్

రహదారి దాటే సమయంలో వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ ఫ్లెక్టైవర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. పూసపాటిరేగ మండలం పేరాపురం జంక్షన్ మీదుగా వెంపడాం, గుంపాం, పతివాడ, చినపతివాడ, తాళ్లపేట, పతివాడబర్రిపేట, కొత్తూరు, తమ్మయ్యపాలెం, పులిగెడ్డతో పాటు పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఫ్లెక్టైవర్ లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పూసపాటిరేగ వద్దకు వెళ్లి వెనక్కి రావాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే వెనక్కి వెళ్లాలన్నా కిలోమీటర్ దూరంలో ఉన్న కోనాడ జంక్షన్ వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి.

డైవర్షన్ ఇవ్వాలి..

పేరాపురం జంక్షన్‌లో డైవర్షన్ ఇవ్వకపోవడంతో 15 గ్రామాల ప్రజలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోనాడ జంక్షన్‌కి వెళ్లి తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. హైవే అధికారులు పునరాలోచన చేసి ఫ్లెక్టైవర్ ఏర్పాటు చేస్తే సమస్య తీరుతోంది. అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలి.

– పతివాడ భాస్కరరావు , పతివాడ

క్లుప్తంగా

ఘనంగా తాజుద్దీన్ బాబా జయంతి


చాదర్ సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: మండలంలోని దాకమర్రి గ్రామంలో హాజరత్ సయ్యద్ మహ్మద్ తాజుద్దీన్ బాబా 164వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బాబాకు చాదర్ సమర్పించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు 'పింఛన్' ఇక్కట్లు..


తేరుకున్న వృద్ధురాలు బంగారమ్మ

విజయనగరం ఫోర్ట్: కూటమి ప్రభుత్వం చేపట్టిన పింఛన్ పునఃపరిశీలన వల్ల దివ్యాంగులకు ఇక్కట్లు తప్పడం లేదు. అనర్హులను ఏరి వేయాలనే ఉద్దేశంతో ముందుగా దివ్యాంగ పింఛన్లను పునఃపరిశీలిస్తున్నారు. ఈక్రమంలో గుర్ల మండలం పల్లి గండ్రేడు గ్రామానికి చెందిన బంగారమ్మ అనే దివ్యాంగ వృద్ధురాలు పింఛన్ పునఃపరిశీలనకు సోమవారం స్థానిక సర్వజన ఆస్పత్రికి వచ్చింది. పరిశీలన అనంతరం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పోర్టికో వద్ద మెట్లు దిగుతుండగా కింద పడిపోయింది. దీంతో ఆమెతో వచ్చిన బంధువులు సపర్యలు చేశారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత బంగారమ్మను ఇంటికి తీసుకెళ్లారు.

భగవద్గీతపై ప్రచారం


వల్లూరులో అవగాహన కల్పిస్తున్న సేవా సమితి సభ్యులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు, చిన తరిమి, పెద తరిమి, తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత – ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీతపై సోమవారం అవగాహన కల్పించారు. యోగి వేమన జయంతిని పురస్కరించుకుని వేమన పద్యాల్లో జ్ఞానం ఆవశ్యకతను ప్రజలకు వివరించామని సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. ప్రతిఒక్కరూ భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు శంకరరావు, ప్రసాద్, భానుమతి, పుణ్యవతి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పైప్‌లైన్ పనులు


నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో పైప్‌లైన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మేరకు కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పనులను సోమవారం పరిశీలించారు. 46వ డివిజన్‌లో యూత్ హాస్టల్ వద్ద సీసీ రోడ్డు చదును పనులు జరుగుతున్నాయి. బీసీ కాలనీలో పైప్‌లైన్‌తో ఓవర్ ఫ్లో పైప్‌లైన్‌ను అనుసంధానం చేసే ఎర్త్ వర్క్‌లు చేపడుతున్నారు. వసంతవిహార్ వద్ద జరుగుతున్న వాటర్ సప్లై పైప్‌లైన్ పనులను ఇంజినీరింగ్ సిబ్బంది పరిశీలించారు. 43వ డివిజన్ సర్వజన ఆస్పత్రి వద్ద నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను ఏఈ రవికుమార్ పర్యవేక్షించారు. అలాగే 41, 11వ డివిజన్లలో జరుగుతున్న పనులను అధికారులు పరిశీలించారు.

సైకిల్‌పై కాశీయాత్ర


సైకిళ్లపై కాశీ వెళ్తున్న భక్తులు

విజయనగరం రూరల్: అనకాపల్లికి చెందిన నలుగురు భక్తులు సైకిల్‌పై కాశీయాత్రకు బయలుదేరారు. యాత్రలో భాగంగా సోమవారు వారు కొండకరకాం గ్రామ సమీపంలోకి రాగా.. సాక్షి వారిని పలుకరించింది. కశింకోట మండలం వెదురుపర్తి గ్రామానికి చెందిన దొంతుకుర్తి స్వర్ణనాగేశ్వరరావు ఆధ్వర్యంలో పుల్లేటికుర్తి సత్య ఆంజనేయులు, అలవరపు హరిబాబు, పోతనాపల్లి రాజు సైకిల్‌పై కాశీ యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. గజపతినగరం, బొబ్బిలి, రాయగడ మీదుగా కాశీకి వెళ్తామన్నారు.

మాజీ ఎమ్మెల్సీ కుటుంబానికి జెడ్పీ చైర్మన్ పరామర్శ


ద్వారపురెడ్డి సావిత్రమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో గల కర్షక మహర్షి ఆస్పత్రి అధినేత డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన్ రావు, టీడీపీ మాజీ శాసనమండలి సభ్యుడు ద్వారపురెడ్డి జగదీష్ మాతృమూర్తి ద్వారపురెడ్డి సావిత్రమ్మ ఇటీవల స్వర్గస్తులయ్యారు. ఈ మేరకు స్థానిక మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ద్వారా విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ జగదీష్ నివాసానికి వెళ్లి ద్వారపురెడ్డి సావిత్రమ్మ చిత్రపటానికి సోమవారం నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, మాజీ వైస్‌చైర్మన్ బెలగాం జయబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్ ఎంపీపీలు సిద్ద జగన్నాథం బంకురు రవిలతో పాటు పలువురు ప్రజా ప్రతినిదులు కౌన్సిలర్‌లు, సర్పంచులు, ఎంపీటీసీ లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పైడితల్లి చండీయాగం


చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: డితల్లి అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో సోమవారం చండీయాగం నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ పర్యవేక్షణలో వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి , సాయికిరణ్ శర్మ, రాజేష్ యాగప్రక్రియను నిర్వహించి, యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను భక్తులకు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వచ్చే నెల 9న ప్రజ్ఞా వికాసం పరీక్ష

విజయనగరం పూల్‌బాగ్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 9న ప్రజ్ఞా వికాసం పరీక్షను నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, రాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారురు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి ఒకటో తేదీలోపు రూ. 30 ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లా స్థాయి విజేతలకు నగదు బహుమతులు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 75692 90549, 79975 32521 నంబర్లను సంప్రదించాలని కోరారు.

హెల్మెట్ తప్పనిసరి

• ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. హెల్మెట్‌ధారణ వల్ల ప్రమాదాల్లో ప్రాణాల నుంచి బయట పడవచ్చని చెప్పారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా హెల్మెట్ వినియోగంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కోట జంక్షన్, మూడు లాంతర్లు, గంటస్తంభం, కేపీ టెంపుల్, రైల్వేస్టేషన్ మీదుగా తిరిగి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హెల్మెట్ లేకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో చాలామంది మృత్యువాత పడుతున్నారని చెప్పారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించే విధంగా చేయాలనే సంకల్పంతో జిల్లా పోలీస్ శాఖ పని చేస్తోందన్నారు. అవగాహన కార్యక్రంలో ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీటీసీ డి.మణికుమార్, ఎంవీఐలు ఎం .మురళీకృష్ణ, యు.దుర్గాప్రసాద్, డీఎస్పీలు ఎం .శ్రీనివాసరావు, యూనివర్స్, సీఐలు సూరినాయుడు, ఎస్.శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, జి.రామకృష్ణ, ఎస్.కాంతారావు, బి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

వైద్య పరికరాల అందజేత


రాకోడు ఆస్పత్రికి అందించిన వైద్య సామగ్రితో సంస్థ సభ్యులు

విజయనగరం రూరల్: గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతూ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, అవేర్ అండ్ హెల్త్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా రూ. 2 లక్షల విలువ చేసే హైడ్రాలిక్ బెడ్స్, లేబర్‌రూం టేబుల్స్, బేబీ వార్మర్ వంటి పలు వైద్య పరికరాలను రాకోడు పీహెచ్‌సీ సిబ్బందికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అవేర్‌గ్రూప్ చైర్మన్ మాధవన్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సురేష్‌బాబు, కేవీఎస్ శర్మ, భాస్కర్ వర్మ, దినేష్, ఆస్పత్రి సిబ్బంది శ్రావణి, అఖిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సదస్సు విజయవంతం చేయండి

నెల్లిమర్ల: ఈపీఎఫ్, రిటైర్డ్ వర్కర్స్ పింఛన్‌దారుల సదస్సును విజయవంతం చేయాలని ఈపీఎఫ్ పింఛన్‌దారుల సంఘ నాయకుడు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన మండల కేంద్రంలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస పింఛన్ రూ. 9 వేలు ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించని ఎడల పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ నెల 28న జిల్లా కేంద్రంలో జరగనున్న సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

పీఎం ఇంటర్న్‌షిప్ వేగవంతం

• కమిషనర్ నల్లనయ్య


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: పీఎం ఇంటర్న్‌షిప్ నమోదు ప్రక్రియ వేగవంతం చేసి, లక్ష్యాలను అధిగమించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం స్థానిక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీఎం ఇంటర్న్‌షిప్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి సచివాలయం నుంచి కనీసం 20 మంది పేర్లను తక్షణమే నమోదు చేసే విధంగా చొరవ చూపాలన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారి వివరాలను ఆధార్ కార్డు, రైస్ కార్డు, విద్యార్హతలతో సహా నమోదు చేయాలని సూచించారు. అలాగే సూర్యఘర్ పథకం ద్వారా ఎక్కువ మంది వినియోగదారులు సోలార్ ప్లాంట్లు అమర్చుకునే విధంగా యుద్ధప్రాతిపదికన చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టీపీఆర్ఓ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఆధార్ శిబిరాలు..

• ఈ నెలాఖరు వరకు 32 కేంద్రాల నిర్వహణ

విజయనగరం: నగరంలోని సచివాలయాల పరిధిలో 32 ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఈ నెల 30 వరకు నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయా కేంద్రాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరవ్యాప్తంగా ఐదు సర్కిళ్ల వారీగా 32 చోట్ల ఆధార్ నమోదు, అప్‌డేషన్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ ప్రైవేట్ కళాశాలల్లో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రతిఒక్కరూ కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ఆధార్ కేంద్రాల సమాచారం, ఇతర వివరాలను సమీపంలో ఉన్న సచివాలయ సిబ్బంది తెలియజేస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలకు వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి పదేళ్లకు ఒకసారి ఆధార్ కార్డును తప్పనిసరిగా నవీకరణ చేయాన్నారు. వృద్ధుల్లో చాలా మందికి వేలిముద్రలు అరిగిపోతాయని, ఈ క్రమంలో ఐరిస్ వీరికి ఉపయోగపడుతుందని తెలిపారు. పింఛన్ల పంపిణీ సమయంలో వేలిముద్రలు నమోదు కాకపోతే వారికి ఐరిస్ ఆధారంగా పింఛను సొమ్ము అందిస్తున్నారన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఐదేళ్లలోపు వారికి బాల ఆధార్ కార్డులు ఇస్తున్నారన్నారు.


ఆధార్ సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ పల్లి నల్లనయ్య

• పరిశీలన..



భోగాపురం మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ వసతిగృహాన్ని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి సోమవారం పరిశీలించారు. వసతిగృహం శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలికంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నారు. త్వరలోనే బీసీ వసతిగృహానికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తామని ఎంపీపీ చెప్పారు. ఆమెతో పాటు ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ గాయత్రి, ఎంఈఓ రమణమూర్తి, ఇన్‌చార్జ్ బీసీ సంక్షేమ వసతిగృహ అధికారి శరణ్మయి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తదతరులున్నారు. – పూసపాటిరేగ

• ప్రమాదకరం..



పూసపాటిరేగ మండలంలోని లంకలపల్లి పాలెం ఆర్‌అండ్‌బీ రహదారిలో గల కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టు మలుపు వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టు వెడల్పు తక్కువగా ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. కల్వర్టు కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – పూసపాటిరేగ

• విద్యార్థుల ప్రతిభ..



'**రా**మాయణం' విలువలపై రామనారాయణంలో సోమవారం జరిగిన సదస్సులోగురజాడ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సుమారు 60 పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ సదస్సులో గురజాడ చిన్నారులు పి.ప్రణీత్, కె.లహరి, ఎ.అస్మిత అద్భుతంగా ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. వ్యాసరచన పోటీల్లో సీహెచ్ జాహ్నవి ప్రథమ బహుమతి సాధించింది. కార్యక్రమంలో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్‌పీ పటాన్నాయక్, గైడ్ డాక్టర్ ఎంవీఆర్.కృష్ణాజీ, కరస్పాండెంట్ స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం

• డైరీ ఆవిష్కరణ..



డెంకాడ మండలం చింతలవలస ఐదో బెటాలియన్‌లో కమాండెంట్ మలికాగార్గ్ పోలీస్ డైరీని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీస్ కుటుంబాల సంక్షేమానికి తమ వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కమాండెంట్లు, అసోసియేషన్ సభ్యులు మిత్తిరెడ్డి అప్పలనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరాడ రామునాయుడు, సెక్రటరి మజ్జి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. – డెంకాడ

• ఒకే ఒక్క వినతి



విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒకేఒక్క వినతి వచ్చింది. ప్రణాళిక విభాగానికి సంబంధించి వచ్చిన వినతిని కమిషనర్ పల్లి నల్లనయ్య స్వీకరించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం

బ్యాటరీల దొంగ అరెస్ట్

విజయనగరం క్రైమ్: ఏటీఎంలలో ఉండే బ్యాటరీలను చోరీ చేసిన నిందితుడ్ని రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి రూరల్ ఎస్సై వి. అశోక్‌కుమార్ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. గుంకలాం గ్రామానికి చెందిన లెంక సత్తిబాబు ఇండియావన్ ఏటీఎంలలో మెయింటెనెన్స్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. జనవరి పదో తేదీన చెల్లూరు ఏటీఎం పని చేయడం లేదని ఫిర్యాదు వస్తే సత్తిబాబు వెళ్లి చూడగా.. ఏటీఎంకు సంబంధించిన మూడు బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఈ నెల 26న సాయంత్రం 5.30 గంటలకు చెల్లూరు హైవేపై అనుమానాస్పదంగా తిరుగుతున్న అమలాపురానికి చెందిన పెచ్చేటి నాగరాజును అదుపులోకి తీసుకుని విచారించగా.. బ్యాటరీలను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతని వద్ద నుంచి మూడు బ్యాటరీలను రికవరీ చేశారు. అదేవిధంగా డెంకాడ , వైజాగ్ గోపాలపట్నం, పెందుర్తి ఏరియాల్లో నేరాలు చేసినట్లు నిందితుడు అంగీకరించాడని ఎస్సై తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ ఎస్ఐ వి.అశోక్‌కుమార్ (వెనుక ముసుగులో నిందితుడు)

సైబర్ కేసులో నిందితుడు అరెస్ట్

విజయనగరం క్రైమ్: గతేడాది నవంబర్ నెలలో నమోదైన కేసుకు సంబంధించి నిందితుడ్ని టూటౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి టూటౌన్ సీఐ శ్రీనివాసరావు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని పత్తిపాటివీధికి చెందిన నాగవరపు శ్రీనివాస్ అనే వ్యక్తి గతేడాది జూన్ 13న ఆన్‌లైన్‌లో పర్సనల్ లోన్ గురించి గూగుల్ సెర్చ్ చేయగా మరుసటి రోజు ఆసిఫ్ అనే వ్యక్తి ఫోన్ చేసి తాను ఒంగోలులో ఐసీఐసీఐ బ్యాంక్‌లో పనిచేస్తున్నానని పరిచయం చేసుకున్నాడు. అదే బ్యాంక్‌లో తనతో పాటు అభిషేక్, సత్యనారాయణ, సాయి, మోక్షజ్ఞ, మహేష్ అనే వ్యక్తులు ఉన్నట్లు రకరకాల ఫోన్ నంబర్లతో సంప్రదించి ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంట్ ఫీజు, ఇతర ఖర్చుల పేరు చెప్పి బాధితుడి నుంచి సుమారు 22.30 లక్షల రూపాయలు తమ బ్యాంక్ ఖాతాలకు జమ చేయించుకున్నారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారించి ప్రకాశం జిల్లా పొదిలి రామ్‌నగర్‌కు చెందిన తిరుమలశెట్టి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు బీటెక్ చేసి చెడు వ్యసనాలకు బానిసై సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడు. నిందితుడ్ని పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టగా ఈ నెల 31 వరకు రిమాండ్ విధించింది.

స్టాల్స్ నిర్వాహకులకు ప్రశంసాపత్రాలు


ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: రిపబ్లిక్ డే సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ఉత్తమంగా నిలిచిన వాటి నిర్వాహకులకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రశంసలు అందుకున్న విభాగాలలో డీఆర్‌డీఏ, పౌర సరఫరాలు, వ్యవసాయం, పశు సంవర్థకం, మత్స్య, వైద్యం, స్కిల్ డవలప్‌మెంట్, కాలుష్య నియంత్రణ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, ముఖ్య ప్రణాళిక అధికారి, గిరిజన సంక్షేమం, ఐసీడీఎస్, సెంచూరియన్ యూనివర్సిటీ శాఖల అధికారులు ఉన్నారు.

